క్లుప్తంగా

యల్లమ్మ తల్లి ఆలయం ప్రారంభం



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

భీమునిపట్నం: జీవీఎంసీ 3వ వార్డు పరిధి గాడు వీధి జీఎస్ఎన్ కాలనీ వద్ద యల్లమ్మ తల్లి ఆలయం గురువారం ప్రారంభమైంది. సుఖీభవ రియల్ ఎస్టేట్ డైరెక్టర్లు గరిమెళ్ల సూర్య కృష్ణమూర్తి, మీర్ అబ్బాస్ హుస్సేన్ సహకారం అందించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త గాడు అప్పలనాయుడు, 2వ వార్డు కార్పొరేటర్ గాడు చిన్నకుమారి లక్ష్మి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న సమారాధన చేశారు.

మర్యాదపూర్వక కలయిక



కోలా గురువులను సత్కరిస్తున్న జీరు వెంకటరెడ్డి

కొమ్మాది: రుషికొండలో గల వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులను జిల్లా సెక్రటరీ జీరు వెంకట రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వెంపాడ వెంకట రమణా రెడ్డి, చిల్ల గణేష్ రెడ్డి, చెట్ల ఎల్లయ్య రెడ్డి, జీరు భరత్ రెడ్డి పాల్గొన్నారు.

మానవాళి హితం కోసం జీవ శాస్త్ర పరిశోధనలు



ప్రసంగిస్తున్న శాస్త్రవేత్త రాకేష్ మిశ్ర

కొమ్మాది: వివిధ రకాల రుగ్మతలకు మూలాలను శోధించడంతోపాటు మానవాళి శ్రేయస్సును కోరేవిధంగా జీవ శాస్త్ర పరిశోధనలు చేపట్టాలని ప్రముఖ శాస్త్రవేత్తలు డాక్టర్ రాకేష్ మిశ్ర, ప్రొఫెసర్ ఎల్.ఎస్.శశిధర్ పిలుపునిచ్చారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులను ఉద్దేశించి గురువారం వారు ప్రసంగించారు. నేషనల్ సెంటర్ ఫర్ జియెలాజికల్ సైన్సెస్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న ప్రొఫెసర్ ఎల్.ఎస్.శశిధర్ మాట్లాడుతూ మానవ పరిణామ క్రమంలో జన్యుపరంగా వచ్చిన మార్పులను ప్రస్తుత ప్రపంచంలో మనిషికి, జంతువులకు, క్రిమికీటకాలకు గల వ్యత్యాసాన్ని వివరించారు.

ఎల్‌పీవోల పంపిణీ నేడు

పద్మనాభం: మండలంలో ల్యాండ్ పూలింగ్‌లో భూములిచ్చిన రైతులకు పరిహారంగా కన్వేయన్స్ డీడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసిన ఎల్‌పీవోలను శుక్రవారం పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ కె.వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చేతుల మీదుగా రైతులకు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

పీఎం పాలెం : దసరా ఉత్సవాల్లో భాగంగా శిల్పారామం (జాతర)లో గురువారం సాయంత్రం ప్రదర్శించిన నృత్యం ప్రేక్షకులను ఆద్యంతం అలరించింది. నగరానికి చెందిన శ్రీ సిద్ధేంద్ర యోగి నాట్యాలయం ఆధ్వర్యంలో కళాకారుల కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కళాకారులు యశస్విని, ఈశ, వేదిత, పల్లవి, పద్మ, అక్షర, హాస్య, స్రవంతి, సాన్వి, పావని పాల్గొనగా సీహెచ్ మోహన లక్ష్మి నృత్య దర్శకత్వం వహించారు.

‘సురక్ష’ శిబిరాలతో ఆరోగ్య భరోసా

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, వైద్యులు, నాయకులు

మధురవాడ: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు మరింత చేరువ చేయడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష ఉచిత వైద్య శిబిరాలతో సామాన్యుల ఆరోగ్యానికి భరోసా లభిస్తోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 6వ వార్డు బక్కన్నపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కొమ్మాది రిక్షా కాలనీలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల సీవోఈలో గురువారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఆరోగ్యశ్రీ ద్వారా అన్ని రకాల రోగాలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామన్నారు. సురక్ష మెడికల్ క్యాంప్‌నకు వచ్చిన రోగుల వివరాలు కేస్ షీట్ ద్వారా ఆన్‌లైన్ చేస్తారని చెప్పారు. మధురవాడ జోన్‌లో మొదట 21 చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని భావించినప్పటికీ, అందరి సౌలభ్యం కోసం 71 క్యాంప్‌లకు పెంచినట్టు చెప్పారు. అనంతరం మెడికల్ ఆఫీసర్లు గోశాల సాల్మన్‌రాజు, దుర్గాభవాని, వైద్య నిపుణులు రాజేష్‌కుమార్, అజయ్, అమూల్యను సన్మానించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి ముత్తంశెట్టి శ్రీనివాసరావు పూలమాలలు వేసి శిబిరాన్ని ప్రారంభించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం రోగులకు కళ్లద్దాలు, మందులు పంపిణీ చేశారు. రిక్షా కాలనీ, గురుకులానికి బస్సు సౌకర్యం కల్పించాలని రిక్షా కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కోరారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ డాక్టర్ ముత్తంశెట్టి ప్రియాంక, జెడ్సీ కె.కనక మహాలక్ష్మి, సీవోఈ పిన్సిపాల్ టి.నాగమణి, వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు యర్రా జోగారావు, సంజీవ్, వరలక్ష్మి, పి.రవి, అల్లాడ లింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సేవలు భేష్

తగరపువలస: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా అందిస్తున్న వైద్య సేవలు చాలా బాగున్నాయని జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు సంతపేట వార్డు సచివాలయం పరిధిలోని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. చిట్టివలస జ్యూట్‌మిల్లు కల్యాణ మండపంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. తగరపువలస యూపీహెచ్‌సీ వైద్యులతో పాటు వివిధ ఆస్పత్రుల నుంచి వచ్చిన ప్రత్యేక వైద్యులు సేవలు అందించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా వార్డు సచివాలయాల కన్వీనర్ జగుపల్లి ప్రసాద్, మాజీ కౌన్సిలర్ జీవీ రమణ, ఎస్సీ సెల్ విభాగం ప్రతినిధులు సిమ్మల ప్రసన్న, పందిరి విజయ్ తదితరులు లబ్ధిదారులకు మందులు, కేస్ షీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అక్కరమాని చినబాబు, చింతగుంట శివ, దుంప సాయిరెడ్డి, గిడుతూరి మురళి, చిల్ల గణేష్ రెడ్డి, గిడుతూరి పూర్ణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

భీమునిపట్నం: జీవీఎంసీ 3వ వార్డు అప్పికొండవీధి సచివాలయ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. 520 మంది రోగులను వైద్యులు పరీక్షించి అవసరమైన వారికి మందులు అందించారు. శిబిరం నిర్వహణ కన్వీనర్ రాంభుక్త దేవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారన్నారు. ప్రత్యేక అధికారి మూర్తి, పారిశుద్ధ్య అధికారి మహాలక్ష్మినాయుడు, సచివాలయ అడ్మిన్ కృష్ణవేణి, వైఎస్సార్ సీపీ నాయకులు ఎర్నింటి అచ్చిబాబు, బాకి రమణారెడ్డి, సంజీవరావు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సంపూర్ణ ఆరోగ్యం

పద్మనాభం: ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకే సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్షకు శ్రీకారం చుట్టారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు అన్నారు. మండలంలోని బి.ఆర్.తాళ్లవలసలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్షను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య సురక్షను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వైద్య సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, సర్పంచ్ చందక శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు చందక పైడినాయుడు, బుడ్డివలస - అగ్రహారం సర్పంచ్ పిన్నింటి సూర్యనారాయణ పాల్గొన్నారు.

రామవరంలో 349 మందికి వైద్య పరీక్షలు

ఆనందపురం : మండలంలోని రామవరంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 349 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 12 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. మిగతా వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో డాక్టర్లు వైష్ణవి, కె.మాధవి, మరో నలుగురు వైద్యులు సేవలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ యర్ర అప్పలరాజు, మండల ప్రత్యేకాధికారి పద్మావతి, వైఎస్సార్ సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, ఎంపీటీసీ సభ్యుడు గొలగాని కృష్ణ, మాజీ సర్పంచ్ కాకర్లపూడి సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.



వైద్యులతో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు లక్ష్మణరావు, తదితరులు



కంటి రోగిని పరీక్షిస్తున్న వైద్యురాలు

భగవాన్‌దాస్ కాలనీలో నేడు వైద్య శిబిరం

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు భగవాన్‌దాస్ కాలనీ వార్డు సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించనున్నట్లు మెడికల్ ఆఫీసర్ సాల్మన్ రాజు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు వివిధ రకాల స్పెషలిస్ట్ వైద్యులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు.

తగరపువలస: చిట్టివలస బంతాట మైదానంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు భీమిలి జెడ్సీ బి.రాము తెలిపారు. ఒకటో వార్డు బొగ్గురోడ్డు – 3 సచివాలయానికి సంబంధించిన ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



సంతపేటలో కేస్ షీట్లు, మందులు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



శిబిరంలో పరీక్షలు చేస్తున్న సిబ్బంది



పరీక్షలు చేయించుకుంటున్న రోగులు



రిక్షా కాలనీలో పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

‘ఓక్రిడ్జ్’లో గ్లోబల్ యూనివర్సిటీ ఫెయిర్

తగరపువలస: భీమిలి మండలం శింగనబంద ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో గురువారం గ్లోబల్ యూనివర్సిటీ ఫెయిర్ నిర్వహించారు. ఇందులో యూరప్, కెనడా, ఐర్లాండ్, ఆస్ట్రేలియా తదితర 55 దేశాల విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. అందుబాటులో ఉన్న కోర్సులు, ప్రవేశాలు, స్కాలర్‌షిప్‌లు, క్యాంపస్‌లను వివరించారు. నగర పరిధిలో ఉన్న విద్యా సంస్థల నుంచి 525 మంది విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. స్కూల్ డైరెక్టర్ అమిత్‌జైన్, ప్రిన్సిపాల్ భమిడిపాటి శైలా మాట్లాడుతూ ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయాలతో నేరుగా నెట్ వర్కింగ్ చేయడానికి ఈ సమావేశం దోహదపడిందని పేర్కొన్నారు.

కృషితో లక్ష్య సాధన

ఆనందపురం : లక్ష్య సాధనకు విద్యార్థులు నిరంతరం కృషి చేయాలని వీతం కళాశాల ప్రిన్సిపాల్ పి.ఉమాదేవి సూచించారు. వేములవలసలోని గాయత్రి డిగ్రీ కళాశాలలో గురువారం విద్యార్థులు ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమాదేవి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు అలవర్చుకుంటే సమాజ సేవలో మమేకం కావడానికి అవకాశం ఉంటుందన్నారు. వ్యసనాలకు దూరంగా ఉంటే భవిష్యత్ ఉజ్వలంగా వుంటుందన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కె.సురేంద్ర మోహన్, కళాశాల చైర్మన్ వై.వెంకటరావు, డైరెక్టర్ బి.రామకృష్ణ, ప్రిన్సిపాల్ డి.అప్పలరాజు, బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు



దుర్గాప్రసాద్

భీమునిపట్నం: స్థానిక రెల్లివీధికి చెందిన ఒక వ్యక్తి అదృశ్యం కావడంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఇక్కడ చల్లా దుర్గాప్రసాద్(43) టిఫిన్ షాపు నిర్వహిస్తుండేవాడు. ఉషారాణి అనే మహిళతో 18 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు సంతానం. ఇటీవల అప్పులు ఎక్కువ చేయడంతో ఈ నెల 4న ఇంటి నుంచి వెళ్లిపోయి అప్పటి నుంచి కనిపించడం లేదు. దీంతో అతని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అమ్మవారి మండపాల్లో అన్నసంతర్పణ



చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు



గ్రంథాలయవీధిలో అన్నసంతర్పణ చేస్తున్న నిర్వాహకులు

తగరపువలస: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారి మండపాల వద్ద అన్నసంతర్పణ చేశారు. చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయంలోని మండపం వద్ద అర్చకుడు ఆకెళ్ల రవికిరణ్ ఆధ్వర్యంలో 3 వేల మందికి అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మల్లిబాబు, రమాదేవి, మేకల శ్రీను తదితరులు పాల్గొన్నారు. గ్రంథాలయ వీధిలో శివగణేష్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసంతర్పణలో భీమిలి ఎస్ఐలు గంటా హరీష్, చింతలపూడి చిరంజీవిరావు, వైఎస్సార్ సీపీ నాయకులు శిల్లా కరుణాకర రెడ్డి, కొప్పల రమేష్, చిల్ల భాస్కరరెడ్డి, చిప్పాడ వెంకటేష్, డబ్బీరు ప్రశాంతి, బింగి హరికిరణ్ రెడ్డి, సరగడ శివాంజనేయ రెడ్డి, తెడ్లాపు అప్పలరాజు, సరగడ నాగిరెడ్డి, చేట్ల ఎల్లయ్య రెడ్డి, డెక్కతి శ్రీనివాస రెడ్డి, దుంప ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగు ఖర్చు తగ్గించడమే పొలం బడి లక్ష్యం

తగరపువలస: తక్కువ పెట్టుబడితో రైతులకు సాగు ఖర్చు తగ్గించడమే పొలం బడి లక్ష్యమని భీమిలి వ్యవసాయాధికారి బి.శివకోమలి అన్నారు. భీమిలి మండలం శింగనబంద పంచాయతీలో రైతులతో పొలం బడి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిత్ర పురుగులపై అవగాహన కలిగించారు. ప్రస్తుత వాతావరణంలో వరి తెగులు, పురుగుల నుంచి రక్షణ కోసం తగు మోతాదులో మందులు వినియోగించాలని సూచించారు. అనంతరం రైతులకు సమగ్ర పురుగు నివారణ కిట్లు అందించారు. వరి పొలాల్లో తూర్పు, పడమర దిశగా కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వీటివల్ల పంటకు గాలి, వెలుతురు తగిలి తెగులు, పురుగు నివారించవచ్చన్నారు. వ్యవసాయ సహాయకులు ఎల్.హరీష్, బి.రమేష్, రైతులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో తెగుళ్ల నివారణ

పద్మనాభం: వరి పంటలో తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని భీమునిపట్నం సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.విజయ్ ప్రసాద్ సూచించారు. మండలంలోని గంధవరంలో గురువారం పొలం బడి నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ ప్రసాద్ మాట్లాడుతూ వరి పంటకు ఆకు ముడుత తెగులు సోకిందన్నారు. దీని నివారణకు ఎకరం విస్తీర్ణానికి కార్టాప్ హైడ్రో క్లోరైడ్ 350 మిల్లీ లీటర్ల మందును రెండు వందల లీటర్ల నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. పాండ్రంగిలో వరి పైరుకు పాడ తెగులు, దోమపోటు సోకిందన్నారు. దీని నివారణకు వంద మిల్లీ లీటర్ల హెక్స కొనజోల్, 250 గ్రాముల ఎసిఫెట్ మందును రెండు వందల లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. రైతులు విచక్షణా రహితంగా పురుగు మందులు వినియోగించవద్దన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు పురుగు మందులు పిచికారి చేయాలన్నారు. కార్యక్రమాల్లో ఎంపీఈవో వి.సతీష్, వ్యవసాయ సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.



శింగనబందలో రైతులతో సమావేశమైన భీమిలి ఏవో శివకోమలి, తదితరులు



గంధవరంలో పంట పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్ ప్రసాద్, తదితరులు

అమ్మలగన్నమ్మకు విశేష పూజలు



శ్రీ లలిత త్రిపుర సుందరీ దేవి అలంకరణలో బబ్బేలమ్మ



స్వర్ణ రజితాలంకృత దుర్గాదేవి అలంకరణలో...



చిల్లపేట ఆలయంలో...



ప్రత్యేక అలంకరణలో లలితా త్రిపుర సుందరీ దేవి



చండీ అవతారంలో కొత్తమ్మతల్లి

మధురవాడ: దుర్గా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మధురవాడ టైలర్స్ కాలనీలోని శ్రీ విజయ దుర్గా దేవికి భక్తులు, కమిటీ ప్రతినిధులు సారె సమర్పించారు. గురువారం సాయంత్రం సారె, ఘటాలు ఊరేగింపు, పల్లకీ సేవతో వీధుల్లో ఆధ్యాత్మికత నెలకొంది. ఆలయ అర్చకులు శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు లలితా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త బంగారు లక్ష్మి, సుబ్బారావు దంపతులు పల్లకీ సేవను ప్రారంభించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు బంగారు ప్రకాశ్, బంగారు అశోక్, తెంటు మాధవి, బంగారు అశోక్, బంగారు ఝాన్సీ, వట్టికుల నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

- ఐటీ సెజ్ జంక్షన్ సమీపంలోని మానం ఆంజనేయులు నగర్‌లోని శ్రీ లలితా త్రిపుర సుందరీ సమేత మహాకామేశ్వర స్వామి దేవాలయంలోని అమ్మ వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డేపల్లి సురేష్, అప్పారావు ప్రత్యేక పూజలు చేశారు.
- చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయంలో అమ్మవారిని స్వర్ణ రజితాలంకృత దుర్గాదేవిగా అలంకరించారు. మహిళలు పసుపు కొమ్ములతో, కుంకుమతో పూజలు చేశారు. ఎండాడకు చెందిన కొల్లి కృష్ణచంద్ర, గౌతమి సహకారంతో ప్రసాదం పంచి పెట్టారు. ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, కమిటీ ప్రతినిధులు పిళ్లా సూరిబాబు, యస్.ఎస్.మూర్తి, పీవీజీ అప్పారావు, నాగోతి తాతారావు, పిళ్లా శ్రీనివాసరావు, పిళ్లా వెంకటరమణ పాల్గొన్నారు.



విజయ దుర్గాదేవికి సారె సమర్పిస్తున్న భక్తులు

సహస్ర కమలాలతో అర్చన

తగరపువలస: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారిని మహాలక్ష్మిలా అలంకరించి పూజలు చేశారు. భీమిలి రోడ్డులోని ఆంధ్రా బ్యాంకు సమీపంలోని మండపంలో అర్చకుడు సోమయాజుల కల్యాణ చక్రవర్తి వెయ్యి కమలాలతో అర్చన, లక్ష్మీ కుబేర, కమలాత్మిక తంత్ర హోమాలు నిర్వహించారు. చిల్లపేటలో దుర్గాభవానీ అమ్మవారికి అర్చకుడు రామోజు వసంత శాస్త్రి వెయ్యి కమలాలతో పూజలు చేశారు. సంతపేట కొత్తమ్మతల్లిని చండీ రూపంలో అలంకరించారు. సంతపేట గొల్లవీధి మండపంలో అమ్మవారి పల్లకీ ఊరేగింపులో భాగంగా జ్యోతులు, 108 కలశాలతో ఊరేగింపు నిర్వహించారు.

పీఎం పాలెం: కారుషెడ్ బబ్బేలమ్మ వారు శ్రీలలిత త్రిపుర సుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి గారెలు, బూరెలు, శనగలు నైవేద్యంగా సమర్పించారు. కమలం పుష్పాలతో ప్రత్యేక పూజలు చేశారు.

ముగిసిన ‘బేసిక్ కోర్స్ ఇన్ మెడికల్ ఎడ్యుకేషన్’



వర్క్‌షాప్ ముగింపులో పాల్గొన్న వైద్య సిబ్బంది

తగరపువలస: సంగివలస అనిల్ నీరుకొండ మెడికల్ కళాశాలలో మూడు రోజులుగా జరిగిన ‘బేసిక్ కోర్సు ఇన్ మెడికల్ ఎడ్యుకేషన్’ గురువారంతో ముగిసింది. నేషనల్ మెడికల్ కమిషన్ – న్యూఢిల్లీ అనుమతితో రీజినల్ సెంటర్ ఆంధ్ర వైద్య కళాశాల ఆధ్వర్యంలో ఈ వర్క్‌షాప్ నిర్వహించారు. దీనికి పరిశీలకునిగా అనాటమీ ప్రొఫెసర్ డాక్టర్ రాంప్రసాద్ హాజరయ్యారు. వైద్య విద్య నూతనంగా ఎలా బోధించాలో శిక్షణ ఇచ్చారు. 13 మంది రిసోర్స్ పర్సన్లు, డీన్ డాక్టర్ పీవీ సుధాకర్, కో ఆర్డినేటర్ బి.ప్రీతి, కరికులం కమిటీ కన్వీనర్ డాక్టర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ విద్యార్థులకు శిక్షణ

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు శిక్షణ పొందుతున్న విద్యార్థులకు గురువారం గణితంలో తర్ఫీదు ఇచ్చారు. జీవీఎంసీ రాయపాలెం హైస్కూల్ ఉపాధ్యాయుడు కేఎస్ఎస్ఎన్ శ్రీనివాసరావు, ఫ్రెండ్స్ ఫౌండేషన్ సొసైటీ అధ్యక్షుడు గంటాన మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు, సుత్తి పైడిరాజు తదితరులు శిక్షణలో పాల్గొన్నారు. అనంతరం ఉపాధ్యాయులను సొసైటీ ప్రతినిధులు సన్మానించారు.